జూబ్లీహిల్స్‌లోనే..
అత్యధిక ఓటర్లు

3,89,954 మంది ఓటర్లతో అగ్రస్థానం

జూబ్లీహిల్స్, జనవరి 7 : హైదరాబాద్ జిల్లాలో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోనే అత్యధిక ఓటర్లు ఉన్నారు. ఎన్నికల సంఘం విడుదల చేసిన తాజా జాబితాలో 3,89,954 మంది ఓటర్లతో జూబ్లీహిల్స్ అగ్రస్థానంలో నిలిచింది. ఇందులో 2,03,137 మంది పురుషులు, 1,86,793 మంది మహిళలు, 24 మంది థర్డ్ జెండర్ ఓటర్లు నమోదయ్యారు. జూబ్లీహిల్స్ తరువాత రెండు స్థానాల్లో యాకుత్‌పురా అసెంబ్లీ నియోజకవర్గంలో 3,66,130 మంది, కార్వాన్ అసెంబ్లీ నియోజకవర్గంలో 3, 65,183 మంది ఓటర్లు నమోదయ్యారు. గతంలో కూడా ఓటర్ల సంఖ్యలో జిల్లాలో టాపర్‌గా ఉన్న జూబ్లీహిల్స్ 2025 లో తన స్థానాన్ని పదిలపరుచుకుంది. జిల్లాలో చార్మినార్ నియోజకవర్గంలో అత్యల్పంగా 2,32,515 మంది ఓటర్లు నమోదయ్యారు. కాగా ఎన్నికల సంఘం జనవరి, ఏప్రిల్, జూలై, అక్టోబర్ నెల 1 వ తేదీతో 18 ఏండ్లు నిండిన వారిని ఓటర్లుగా నమోదు చేస్తున్న విషయం తెలిసిందే. ప్రతి ఏడాది నాలుగు సార్లు ఓటరు నమోదు చేసుకునే అవకాశం కల్పించడంతో స్థానిక ఎన్నికల సమయానికి ఓటర్ల సంఖ్య మరింత పెరగనుంది.

అభివృద్ధే లక్ష్యంగా.. పనిచేద్దాం

–నార్సింగి మున్సిపాలిటీలో రూ.5.60 కోట్ల నిధులతో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు

మంచిరేవుల గ్రామంలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ నాగపూర్ణశ్రీనివాస్ తదితరులు

మణికొండ, జనవరి 7 : రాజకీయాలకు అతీతంగా అభివృద్ధే లక్ష్యంగా కలిసికట్టుగా ముందుకు సాగాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని మంచిరేవుల, నార్సింగి గ్రామాల పరిధిలోని 6,9,10,11,13,15,18 వార్డులల్లో రూ.5.60 కోట్ల నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అంతర్గత మురుగునీటి కాలువలు, సీసీరోడ్లు, వైకుంఠ ధామాలు, సెంట్రల్ లైటింగ్, కమ్యూనిటీ హాల్‌లను స్థానిక మున్సిపల్ కమిషనర్ మైలారం నాగపూర్ణశ్రీనివాస్, వైస్ చైర్మన్ విజయబాబు, కౌన్సిలర్లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారం విషయంలో రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులను కలిసికట్టుగా పూర్తిచేసుకోవాలని సూచించారు. నార్సింగి మున్సిపాలిటీని అన్నిరంగాలల్లో అభివృద్ధి పర్చేందుకు శక్తివంచనలేకుండా పనిచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ వేణుగౌడ్, గుడిమల్కాపూర్ మార్కెట్ చైర్మన్ మల్లేష్‌ముదిరాజ్, వైస్ చైర్మన్ విజయబాబు, మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణమోహన్‌రెడ్డి, డీఈ నరేష్‌కుమార్, ఏఈ శ్రీనివాస్, మేనేజర్ యోగేష్‌నాయక్, ఆయా వార్డు కౌన్సిలర్లు పత్తి శ్రీకాంత్‌రావు, పత్తి ప్రవీణ్ కుమార్, లక్ష్మీప్రవళిక,సునీత, అమరేందర్‌రెడ్డి, లంకల పద్మ, ఉషారాణి, నాయకులు పాపిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, నర్సింహ, ప్రవీణ్‌యాదవ్, లక్ష్మణ్, శ్రీనివాస్,రాము, హరిశంకర్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

తవ్విన కాలువలకు మరమ్మతులు చేపట్టండి

-జలమండలి అధికారులను కోరిన బీఆర్ఎస్ నేతలు

జలమండలి శాఖ డీజీఎంను కలిసి సమస్యను వివరిస్తున్న బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు దూళిపాళ నీతారాం తదితర నేతలు

మణికొండ, జనవరి 7 : మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీల్లో పైపులైన్ల కోసం తవ్విన కాలువలను పదిలివేయడంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారంటూ తక్షణమే మరమ్మతులు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ పార్టీ నేతలు మంగళవారం అధికారులను కలిసి విన్నవించారు. పార్టీ అధ్యక్షుడు సీతారాం దూళిపాళ నేతృత్వంలో డీజీఎం నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మున్సిపాలిటీ పరిధిలోని హుడాకాలనీ, లాలమ్మగార్డెన్స్ కూడలి, గండిపేట జలాశయ కాండూట్ లీకేజీలు సరిచేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కాలనీల ప్రధాన రహదారుల్లో తవ్విన కాలువలతో రోడ్లు అస్తవ్యస్తంగా మారాయని వాటి మరమ్మతుల కోసం చొరవచూపాలని వినతిపత్రంలో బీఆర్ఎస్ నేతలు కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు రూపారెడ్డి, నాయకులు అందె లక్ష్మణ్‌రావు, గుట్టమీది నరేందర్, గోరుకంటి విఠల్, సంగం శ్రీకాంత్, రాజేంద్రప్రసాద్, కిరణ్, షేక్ ఆరీఫ్, ఆరీఫ్ మహమ్మద్, బొడ్డు శ్రీధర్, విజయలక్ష్మి, సుమ, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల
సమస్యలు పరిష్కరించాలి

హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న రవీందర్

హిమాయత్‌నగర్,జనవరి7: రాష్ట్ర వ్యాప్తంగా మధ్యాహ్న భోజన పథకంలో పనిచేసే కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం చెందిందని తెలంగాణ మధ్యాహ్న భోజ న పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.ప్రేంపావని,రాష్ట్ర ప్రధా న కార్యదర్శి జంపాల రవీందర్ విమర్శించారు.మంగళవారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచి, వంటగ్యాస్,కోడిగుడ్లు,సరుకులను ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో విజయలక్ష్మి,రంగారెడ్డి, ప్రసాద్, రామకృష్ణ,వెంకటేశ్ పాల్గొన్నారు.

పౌష్టికాహారం కోసం ఆర్థిక చేయూత



పద్మశాలిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.20 వేల చెక్కు అందజేస్తున్న రవి ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ యూనిట్–3 యాజమాన్య సంస్థ ప్రతినిధులు

మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 7: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు చేయూత అందించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని రవి ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ యూనిట్–3 యాజమాన్య సంస్థ ప్రతినిధులు కోరారు. పద్మశాలిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులకు పౌష్టికాహారం , వారి విద్యాభివృద్ధి నిమిత్తం రవిఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ యూనిట్–3 తరపున విద్యార్థులకు రూ. 20 వేల నగదు సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకొని తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలి

హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు

హిమాయత్‌నగర్,జనవరి7: భారత రాజ్యాంగం,ప్రజాస్వామ్యం,లౌకికవాదాన్ని రక్షించుకునేందుకు ప్రతి పౌరుడు కృషి చేయాలని ఏఐపీఎఫ్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ కె.రజిని, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వీఎస్‌బోస్ పిలుపునిచ్చారు. మంగళవారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో ఏఐపీఎఫ్ రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో సామ్రాజ్య వాద ఆధిపత్యం పెరగడంతో రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.అనంతరం ఏఐపీఎఫ్ ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.ఈ సమావేశంలో ఏఐపీఎఫ్ రాష్ట్ర నేతలు పి.ప్రేం పావని,అన్వర్‌పాషా,భిక్షమయ్య,సలీమ్‌ఉద్దీన్,బి.స్టాలిన్,శ్రీధర్ పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును
ఏర్పాటు చేయాలి

హిమాయత్‌నగర్,జనవరి7: రాష్ట్రంలో భవన నిర్మాణ రంగంలో పనిచేసే కార్మికుల కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జాతీయ నేత రత్నాకర్,తెలంగాణ రాష్ట్ర బిల్డింగ్ నిర్మాణ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారగోని ప్రవీణ్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మంగళవారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో యూనియన్ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల అడ్డాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించి,60 ఏండ్లు దాటిన ప్రతి కార్మికునికి పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు.ప్రమాదంలో మరణించిన కార్మికులకు రూ.10 లక్షలు, సహజ మరణం పొందిన వారికి రూ.5లక్షలు,వివాహ కనుకగా రూ.1లక్ష ఇవ్వాలని కోరారు.ఈ సమావేశంలో యూనియన్ నేతలు పానుగంటి పర్వతాలు, ఎం. శ్రీను, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శంషాబాద్ రూరల్, జనవరి 7 : మండలంలోని పెద్దషాపూర్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఉదయం నుంచి విద్యార్థులు ఉపాధ్యాయులై మిగితా విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించడంతో పాటు విద్యాశాఖలో వివిధ స్థాయి అధికారులు వచ్చి పాఠశాలలో సందడి చేశారు. ప్రతిరోజూ ఉపాధ్యాయులు ఏవిధంగా విద్యాబోధన చేస్తారో అదే విధంగా విద్యాబోధన చేసి అందరిని ఆశ్చర్యానికి గురిచేశారని ఉపాధ్యాయులు తెలిపారు. డీఈవోగా సుష్మిత, ఎంఈవోగా వివేకానంద, పాఠశాల హెచ్ఎంగా అఖిల్ బాధ్యతలు నిర్వహించిన్నట్లు పాఠశాల హెచ్ఎం దారబాల్‌రాజు తెలిపారు. విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదిగి మంచిపేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వదన, అశ్విని, మృధులత విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులే...ఉపాధ్యాయులైన వేళ

పెద్దషాపూర్ పాఠశాలలో ఉపాధ్యాయులుగా బాధ్యతలు నిర్వహించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

'పారదర్శకంగా పార్ట్‌టైం
అధ్యాపకుల నియామకాలు'

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 7: ఓయూ జర్నలిజం విభాగంలో పార్ట్ టైం అధ్యాపకుల నియామకాలను పారదర్శకంగా నిర్వహించినట్లు అధికారులు స్పష్టం చేశారు. కొన్ని పత్రికల్లో వచ్చిన వార్తను ఖండించారు. ఊహాజనితమైన విషయాలను ప్రచురించే ముందు వర్సిటీ వివరణ తీసుకోవాలని సూచించారు. అన్ని అర్హతలతో పాటు నిబంధనలకు అనుగుణంగానే నియామకం జరిగిందని ఉద్ఘాటించారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

బాలాజీనగర్‌లో డ్రైనేజీ పైపులైన్ వివరాలను అధికారులను అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి.

మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 7: అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులను సకాలంలో పూర్తి చేయాలని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని బాలాజీనగర్, లక్ష్మీగూడ, బృందావన్ కాలనీల్లో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ పైపులైన్ పనులను జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో ఎలాంటి నాణ్యతా లోపాలు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో జలమండలి డీజీఎం రేణుక, జనార్దన్, హనుమంత్‌రెడ్డి, తలారి చిన్నా, పాండు, రంజిత్‌సింగ్, రాజు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పూలసాగుతో అధిక లాభాలు

వ్యవసాయ యూనివర్సిటీ ,జనవరి 7: రాష్ట్రంలో పూల సాగుకు వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని , రైతులు తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందవచ్చని కొండాలక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం పూల విభాగం హెడ్ డా. గాదె జ్యోతి అన్నారు. మంగళవారం నగరంలోని బొల్లారం రాష్ట్రపతి నిలయంలో ఏర్పాటు చేసిన రైతు సదస్సుకు ఆమె పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. ఇతర పంటలకన్నా తక్కువ పెట్టుబడి, నీటి వనరులతో పూల సాగు చేయవచ్చన్నారు. పట్టణ ప్రజలు కూడా సమీపంలో , ఇంటి పై భాగంలో కూడా పూల సాగు చేయవచ్చని సూచించారు. నాణ్యత గల విత్తనాలు వర్సిటీలో అందుబాటులో ఉంటాయన్నారు. ప్రధానంగా బంతి, చామంతి, మల్లె తదితర పూలు సాగు చేయడం వల్ల అధిక లాభాలు పొందవచ్చన్నారు. పది మందికి పైగా కమిటీ ఏర్పాటు చేసుకొని సంప్రదిస్తే పూల సాగుపై శిక్షణ ఇస్తామన్నారు. హైదరాబాద్ నగర ప్రజలు తాజా పూలకు, తెలంగాణ రాష్ట్రంలో బతుకమ్మ, దసరా, దీపావళి వంటి పండుగలతో పాటు ఏడాది పాటు అధిక డిమాండ్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్రంలోని ఉమ్మడి మహబూబ్‌నగర్, కరీంనగర్, రంగారెడ్డి, మెదక్, నల్గొండ రైతులు పాల్గొన్నారు.

మచ్చ ప్రభాకర్ సేవలు మరువలేనివి

నారాయణగూడ పద్మశాలి భవన్‌లో మచ్చ ప్రభాకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నేతలు

హిమాయత్‌నగర్,జనవరి7: సమాజానికి పద్మశాలి సంఘం నేత కీర్తిశేషులు మచ్చ ప్రభాకర్ అందించిన సేవలు మరువలేనివని అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి అన్నారు.మచ్చ ప్రభాకర్ ప్రథమ వర్ధంతి సందర్భంగా మంగళవారం నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో ఆయన చిత్రపటానికి పలువురు పూలమాల వేసి నివాళి లర్పించారు. ఈ సందర్భంగా కందగట్ల స్వామి మాట్లాడుతూ పద్మశాలీలు ఐక్యమై ప్రభుత్వ పరంగా వచ్చే హక్కులను సాధించుకోవాలని పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి గడ్డం జగ న్నాథం, నేతలు మాచర్ల రామచంద్రరావు, భాస్కర్,అంబటి నివాస్, రాకేష్, లక్ష్మణ్,చక్రధర్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్
చైర్మన్‌కు వినతి

బన్సీలాల్‌పేట్, జనవరి 7: ఇటీవల గాంధీనగర్ పీఎస్ పరిధిలో నరేందర్ అనే వ్యక్తి హత్యకు గురయ్యాడు. దానిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి విచారించాలని హైదరాబాద్ జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మా నిటరింగ్ సభ్యురాలు పులి కల్పన బాధితులు విజయలక్ష్మి, శారదతో కలిసి ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు.

గత సెప్టెంబర్‌లో భోలక్‌పూర్‌కు చెందిన భవన నిర్మాణ కార్మికుడు ఎరుకల నరేందర్ బోయిగూడ కల్లు దుకాణం వద్ద అగంతకులు దాడి చేయడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడని వారు వివరించారు.

కుంటు పడుతున్న అభివృద్ధి పనులు

- కార్పొరేటర్ ప్రతిపాదనలు, ఐటీ మంత్రి సిఫారసు లేఖ కూడా బుట్టదాఖలు..
- మార్చిలోపు పనులు చేపట్టకపోతే నిధులు నిష్ప్రయోజనం

జూబ్లీహిల్స్,జనవరి 7 : యూసుఫ్‌గూడ సర్కిల్‌లో అభివృద్ధి పనులు కుంటుపడ్డాయి. కొత్త రోడ్లకు ప్రతిపాదనల సంగతేమో కానీ పాత రోడ్ల పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిపోయాయి. ఇప్పటికే మంజూరైన ఈ రోడ్లను మార్చిలోపు పూర్తిచేయక పోతే మంజూరైన నిధులు బూడిదలో పోసిన పన్నీరుగా మారే అవకాశం ఉంది. అంతేకాక ఆయా ముడి సరుకుల ధరలు పెరిగితే కొత్త ప్రణాళికలు.. కొత్త ప్రతిపాదనలతో కొత్త ఫైల్‌లు తిరిగి జీహెచ్ఎంసీ అనుమతికి పంపాల్సి ఉంటుంది. అయితే గతంలో వేసిన రోడ్లు, చేసిన అభివృద్ధి పనులకు బిల్లుల మంజూరులో జాప్యం జరుగుతుందన్న నెపంతో కాంట్రాక్టర్లు పనులు చేపట్టడం లేదు. దీంతో యూసుఫ్‌గూడ సర్కిల్‌లో అభివృద్ధి పనుల జాడే కానరావడంలేదు. జీహెచ్ఎంసీ 19వ సర్కిల్ బోరబండ డివిజన్‌తో పాటు మరికొన్ని వార్డులలో కొన్ని రోడ్లకు నిధులు మంజూరైనా నిష్ప్రయోజనంగా మారే పరిస్థితి నెలకొంది. ఆయా రోడ్లకు నిధులున్నా ఈ ఏడాది పనులు ప్రారంభమయ్యే సూచనలు కనపడడంలేదు. దీంతో అధికారులు సైతం కార్యాలయానికి వచ్చి వెళ్తున్నారే తప్ప పనుల జోలికి వెళ్లడం లేదు. యూసుఫ్‌గూడ సర్కిల్‌లో కాంట్రాక్టర్లైతే పనులు చేయబోమని భీష్మించుక్కూర్చున్నారు.

ఫలితంగా 2024–25 ఆర్థిక సంవత్సరం మరో మూడు నెలల్లో ముగియనుండగా అభివృద్ధి పనుల ఊసే లేకుండా ఉసూరుమనిపించనుంది.

కార్పొరేటర్ల ప్రతిపాదనలు బుట్టదాఖలు

యూసుఫ్‌గూడ డివిజన్‌లో రోడ్ల అభివృద్ధికి స్థానిక కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్ చేసిన ప్రతిపాదనలు కూడా పట్టించుకోలేని పరిస్థితి నెలకొంది. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆధ్వర్యంలో మంజూరు చేసిన రోడ్లు, ఇతర అభివృద్ధి పనులు మినహా కొత్త ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి పనులంటూ లేకుండా పోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పుటి నుంచి అధికారులు ఎంతసేపు ప్రజా పాలన కార్యకలాపాలు, ఇతర సర్వేలతో కాలం వెల్లదీస్తున్నారని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ అధికారులు నూతన ఆర్థిక సంవత్సరం రాకముందే అభివృద్ధి పనులపై దృష్టి సారించాలని.. పెండింగ్ రోడ్లు, ఇతర అభివృద్ధి పనులు పూర్తిచేయాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై అధికారుల వివరణ కోరగా బోరంబడ డివిజన్‌లో కొన్ని రోడ్లు పెండింగ్‌లో ఉన్నాయని డిప్యూటీ ఈఈ బి.భానుచందర్ తెలిపారు. కాగా యూసుఫ్‌గూడ సర్కిల్‌లో అభివృద్ధి పనులు పెండింగ్‌లో లేవని.. కొత్త పనులు కూడా మంజూరు కాలేదని ఈఈ యూ.రాజ్‌కుమార్ తెలిపారు.



యూసుఫ్‌గూడలో రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఐటీ మంత్రి ఇచ్చిన సిఫారసు లేఖ. (ఫైల్)

వ్యక్తి అదృశ్యం

సాయిలుగౌడ్ (ఫైల్)

శంషాబాద్ రూరల్, జనవరి 7 : వ్యక్తి అదృశ్యమైన ఘటన మంగళవారం శంషాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన సాయిలుగౌడ్(55) కుటుంబ సభ్యులతో కలిసి మూడు నెలల నుంచి మండలంలోని పెద్దగోల్కొండ గ్రామంలో అద్దె ఇంట్లో ఉంటున్నారు. కొడుకు అరుణ్ కుమార్‌గౌడ్ ఎయిర్‌పోర్టులో సెక్యూరిటీగార్డ్‌గా పని చేస్తున్నాడు. ఇటీవల సాయిలుగౌడ్ మద్యానికి బానిసగా మారి ఎలాంటి పనులు చేయడంలేదు. దీంతో కొడుకు మద్యం తాగవద్దు అంటు మందలించాడు. దీంతో ఈ నెల 3న ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఎక్కడ వెతికినా ఫలితం దక్కలేదు. దీంతో పోలీసులకు కొడుకు అరుణ్‌కుమార్ ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ఐకమత్యంగా లేకనే దళితులపై వివక్ష

- ఏఐఆర్‌డీఎం మహాసభ ముగింపు కార్యక్రమంలో సీపీఐ నేత అజీజ్ పాషా
- మహాసభలో కుప్పకూలిన కేరళ నేత బీజు చికిత్స పొందుతూ ప్రైవేట్ దవాఖానలో మృతి

ఖైరతాబాద్, జనవరి 7 : స్వాతంత్ర్యం వచ్చి 78 ఏండ్లు గడుస్తున్నా నేటికీ దళితులు వివక్షతకు గురికావడమంటే సమాజం సిగ్గుపడాల్సిన విషయమని సీపీఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపీ సయ్యద్ అజీజ్ పాషా అన్నారు. అఖిల భారత దళిత హక్కుల ఉద్యమం (ఏఐఆర్‌డీఎం) రెండో జాతీయ మహాసభల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అజీజ్ పాషా మాట్లాడుతూ అంటరానితనం నిర్మూలన, అత్యాచారాల నిరోధక చట్టం లాంటి అనేక చట్టాలు వచ్చినా దేశంలో దళితులపై ఇంకా దాడులు కొనసాగుతున్నాయన్నారు. దళితులు, ఆదివాసీలు, బీసీ కులాల వారు ఐకమత్యంగా లేకపోవడం వల్లే అగ్రవర్ణాల అరాచకాలు కొనసాగుతున్నాయన్నారు. ఈ దాడులను తిప్పికొట్టేందుకు సామాజిక, దళిత ఉద్యమాలను మరింత ఉధృతంగా నిర్వహించాలన్నారు. ఏఐడీఆర్‌ఎం జాతీయ ప్రధాన కార్యదర్శి వీఎస్ నిర్మల్ కుమార్, జాతీయ నాయకులు ఎం. బాల నరసింహ, కె. ఏసురత్నం, మరుపాక అనిల్‌కుమార్, దేవి కుమారి, లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అజీజ్ పాషా

మహాసభలో కుప్పకూలిన కేరళ నేత

ఏఐడీఆర్‌ఎం ముగింపు సభలకు హాజరైన అఖిల భారత దళిత హక్కుల ఉద్యమం కేరళ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు టీఆర్ బీజు (52) మంగళవారం ముగింపు కార్యక్రమం జరుగుతున్న సమయంలో గుండెపోటుతో ఒక్కసారిగా కుప్పకూలారు. వెంటనే అక్కడున్న వారు ఆయనను సోమాజిగూడలోని ప్రైవేట్ దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందారు. ఆయన భౌతిక కాయానికి మాజీ ఎంపీ అజీజ్ పాషా, ఏఐఆర్‌డీఎం నేతలు నివాళులర్పించారు. అనంతరం ఆయన మృతదేహాన్ని కేరళకు ప్రత్యేక అంబులెన్స్‌లో తరలించారు.

రచయితలు, మేధావులపై
పెరుగుతున్న దాడులు

సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి పి.సూర్యం

ముషీరాబాద్, జనవరి 7: తెలంగాణ రాష్ట్రంలో కొన్ని రోజులుగా ప్రగతిశీల రచయితలు, మేధావులు, ఉపాధ్యాయులపై మతోన్మాద గుండాల దాడులు పెరిగిపోతున్నాయ ని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి పి.సూర్యం అన్నారు.

హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో కొంత మంది ఉన్మాదులు వీక్షణం సంపాదకులు వేణుగోపాల్‌పై దాడి చేయడం అత్యంత దుర్మార్గమని ఒక ప్రకటనలో తెలిపారు. ఈ దాడిని ప్రజాస్వామికవాదులు ఖండించాలని, బెదిరింపు కాల్స్, సోషల్ మీడియాలో ట్రోలింగ్ చేయడం శోచనీయమని అన్నారు. చంపుతామని బెదిరింపులకు పాల్పడటం ఫాసిస్టు పోకడలకు నిదర్శనమని విమర్శించారు. ఇటువంటి చర్యలను ప్రభుత్వం ఉక్కుపాదంతో అణిచివేయాలని కోరారు.

ప్రయాణికుల భద్రత, రక్షణకు కృషి

మారేడ్‌పల్లి, జనవరి 7: రైల్వే ప్రయాణికుల భద్రత, రక్షణ కోసం ఆర్పీఎఫ్ పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నట్లు సికింద్రాబాద్ ఆర్పీఎఫ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం.వెంకట్‌రెడ్డి అన్నారు. లాలాపేట–తార్నాక రైల్వే బ్రిడ్జి వద్ద మంగళవారం ఆపరేషన్ సంరక్షణలో భాగంగా రాళ్ల దాడి, హ్యూమన్ రన్ ఓవర్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాలను నివారించడానికి, ప్రయాణికులు సురక్షితమైన రైల్వే ప్రయాణాన్ని చేయడానికి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. కదులుతున్న రైళ్లను ఎక్కడం, దిగడం వల్లన కలిగే నష్టాలను వివరించారు. భద్రతా అవగాహనను మరింత పెంచేందు కు, రైల్వే భద్రతకు సంబంధించి, ఆందోళనలు ఎదురైనప్పుడు తక్షణ సహాయం కోసం రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ టోల్–ఫ్రీ నంబర్ 139 కు కాల్ చేయాలని సూచించారు.

మాలలపై అసత్య
ప్రచారాలు మానుకోవాలి

మాల సంక్షేమ సంఘం అధ్యక్షులు రాంప్రసాద్

ఖైరతాబాద్, జనవరి 7: మాలలపై అసత్య ప్రచారాలను చేయడం మానుకోవాలని మాల సంక్షేమ సంఘం అధ్యక్షులు బత్తుల రాంప్రసాద్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన